క్లుప్తంగా

18న శ్రీ సుబ్రమణ్య షష్ఠి

కడప కల్చరల్ : కడప నగరం రైల్వేస్టేషన్ రోడ్డులోని మహావీర్ సర్కిల్‌లో ఈనెల 18న శ్రీ సుబ్రమణ్యషష్ఠిని పురస్కరించుకుని విశేష పూజోత్సవాలు నిర్వహిస్తున్నామని అర్చకులు సాందీప్ శర్మ తెలిపారు. ఇందులో భాగంగా ఉదయం 5 గంటలకు అభిషేకాలు, 11 గంటలకు అన్నప్రసాద వినియోగం, సాయంత్రం 5 గంటలకు క్షీరాభిషేకం, 6 గంటలకు శ్రీ సుబ్రమణ్యస్వామి కల్యాణం నిర్వహిస్తామన్నారు. 19న సాయంత్రం గ్రామోత్సవం ఉంటుందని తెలిపారు.

■ ఇండస్ట్రియల్ ఎస్టేట్ రామచంద్రయ్య కాలనీలోగల శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రమణేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 17, 18 తేదీలలో శ్రీ సుబ్రమణ్యషష్ఠి ఉత్సవాన్ని నిర్వహించనున్నారు. 17న సాయంత్రం స్వామి, అమ్మవార్ల ఎదుర్కోలు ఉత్సవం నిర్వహిస్తారు. 18న మధ్యాహ్నం 12 గంటలకు సుబ్రమణ్యస్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తారు.

జగనన్నకు చెబుదాంకు స్పందన



రామరాజుపల్లెలో పట్టిన కోతులను చూపిస్తున్న డీహెచ్‌పీఎస్ నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి స్పందన లభించినట్లు డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు మునెయ్య పేర్కొన్నారు. ఇటీవల రామరాజుపల్లెలో కోతుల బారి నుంచి ప్రజలను కాపాడాలని జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా నగరపాలక సంస్థ కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్‌కు విన్నవించామన్నారు. ఆయన స్పందించి బుధవారం రామరాజుపల్లెలోని కోతులను పట్టించడం జరిగిందన్నారు.

పుస్తకాలు, మైకు వితరణ



విద్యార్థికి నోట్‌బుక్‌ను అందచేస్తున్న ఎంఈఓ పాలెం నారాయణ

కడప ఎడ్యుకేషన్ : కడప మండలం వాటర్‌గండి వర్కు వద్ద ఉన్న మండల పరిషత్తు ప్రాథమికోన్నత పాఠశాలలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలుగా పనిచేస్తున్న క్రిష్ణవేణి తన స్కూల్‌లో చదివే 6,7,8 తరగతుల విద్యార్థులకు నోట్‌బుక్స్, కాపీ రైటింగ్ బుక్స్‌తోపాటు స్కూల్‌కు స్పీకర్, మైకును వితరణగా ఇచ్చారు. బుధవారం పాఠశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంఈఓ పాలెం నారాయణ ముఖ్య అతిథిగా హాజరై వీటిని విద్యార్థులకు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ స్టేట్ కమిటీ సీపీఎస్ కన్వీనర్ గుజ్జల తిరుపాల్, రాష్ట్ర సెక్రటరీ శివారెడ్డి, స్కూల్ కమిటీ చైర్మన్ దేవ సహాయం, పుష్పరాజ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి



పోస్టల్ ప్రధాన కార్యాలయం ఎదుట సమ్మె చేపడుతున్న గ్రామీణ డాక్ సేవకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : గ్రామీణ డాక్ సేవకులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఆలిండియా గ్రామీణ డాక్‌సేవక్స్ యూనియన్ (ఏఐజీడీఎస్‌యు) జిల్లా కార్యదర్శి రాము పేర్కొన్నారు. బుధవారం గ్రామీణ డాక్ సేవక్‌ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నగరంలోని పోస్టల్ ప్రధాన కార్యాలయం ఎదుట రెండవ రోజు సమ్మె చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలిండియా గ్రామీణ డాక్‌సేవక్స్ యూనియన్ అధ్యక్షుడు కృష్ణయ్య, యూనియన్ నాయకులు మహేష్ చంద్ర, రఘురామిరెడ్డి, రఫీ తదితరులు పాల్గొన్నారు.

పాలాభిషేకం



సీఎం చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న ఖాదర్‌బాష తదితరులు

కడప రూరల్ : డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య శ్రీ ప్యాకేజీ పెంపు చారిత్రాత్మక నిర్ణయమని జీకే యూత్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు పఠాన్ ఖాదర్‌బాష అన్నారు. ఆరోగ్య శ్రీ ప్యాకేజీని రూ. 5 లక్షల నుంచి రూ. 25 లక్షలకు పెంచుతూ నిర్ణయం తీసుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ బుధవారం స్థానిక మట్టి పెద్దపులి వద్ద గల కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ అబ్దుల్లా, కదిరి సలీం, సయ్యద్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ప్రభుత్వంలోనే మహిళా సాధికారత

ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా



వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా



సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్ : జగనన్న ప్రభుత్వంలోనే మహిళా సాధికారత జరుగుతోందని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజాద్ బాషా అన్నారు. స్థానిక అగాడి వీధి 37 వ డివిజన్‌లో 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' అనే కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అంజాద్‌బాషా మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ఇంకా అభివృద్ధి చెందాలంటే, మనందరి కుటుంబాలు బాగుపడాలంటే మళ్లీ జగన్ ప్రభుత్వం రావాలన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి పేద ప్రజలకు అందించడం జరిగిందన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా వైఎస్ జగన్ పాలన చేస్తున్నారన్నారు. జగనన్న ఉంటేనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి భవిష్యత్తు అని అన్నారు. మహిళా సాధికారత, మహిళా సంక్షేమానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను తెలియజేశారు. అనంతరం మా నమ్మకం నువ్వే జగనన్న అనే సంక్షేమ పథకాల ఫ్లెక్సీని, 'ఆంధ్రప్రదేశ్ కి జగనే ఎందుకు కావాలి' అనే ఫ్లెక్సీని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, 37 వ డివిజన్ కార్పొరేటర్ శ్రీవాణి, ఇంచార్జి బసవరాజు, కార్పొరేటర్లు షఫీ, అజ్మతుల్లా, కోఆప్షన్ సభ్యుడు హరూన్ బాబు, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ ఇబ్రహీం మియా, నాయకులు ఎన్. సుబ్బారెడ్డి, సుబాన్ బాషా పాల్గొన్నారు.

నవరత్నాలతో నవశకం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్న పథకాల వల్ల రాష్ట్రంలో నవశకం మొదలైందని ఉప ముఖ్యమంత్రి ఎస్.బి అంజాద్ బాషా అన్నారు. బుధవారం 'గడప గడపకు మన ప్రభుత్వం'లో భాగంగా అగాడి వీధి, అబ్దుల్ నబీ వీధి సచివాలయం పరిధిలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఏవిధంగా చేరుతున్నాయని అడిగి తెలుసుకున్నారు.

■ ఆర్ల వెంకటమ్మ అనే మహిళ మాట్లాడుతూ వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయ్యాక ఇంటి స్థలం, ఇంటిని నిర్మించు కోవడానికి నగదు, జగనన్న అమ్మ ఒడి, వైఎస్ఆర్ పింఛన్ కానుక, వైఎస్ఆర్ సున్నా వడ్డీ, వైఎస్ఆర్ చేయూత వంటి పథకాల ద్వారా రూ. 10,40,315 లబ్ధి చేకూరిందని, దీంతో మా కుటుంబం అంతా సంతోషంగా ఉన్నామని తెలిపింది.

■ సయ్యద్ ఫజుల్లిల్లాహ్ బాషా మాట్లాడుతూ తనకు తన కుటుంబానికి జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ పింఛన్ కానుక, ఇంటి స్థలం, ఇల్లు నిర్మించుకోవడానికి నగదు మొత్తం కలిపి.. రూ.10,10,907 మేలు జరిగిందని తెలిపారు.

■ అంతకుముందు నగరపాలక జనరల్ ఫండ్స్ నుండి రూ.20 లక్షల అంచనా వ్యయంతో రెండు సీసీ రోడ్ల నిర్మాణానికి ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా చేతుల మీదుగా భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో 34 వ డివిజన్ ఇంచార్జి ఏ.ఆలీ, వైఎస్సార్ సీపీ నాయకులు పి. జయచంద్రారెడ్డి, బంగారు నాగయ్య, ఎన్. సుబ్బారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, పవర్ అల్తాఫ్, గౌస్, కమాల్‌బాషా, పస్తం అంజి, మునిశేఖర్‌రెడ్డి, రామక్రిష్ణారెడ్డి, మియ్యా, టీపీ వెంకట సుబ్బమ్మ, బండి మరియలు, పర్వీన్ పాల్గొన్నారు.

అహోబిల మఠంలో ధనుర్మాస పూజలు

కడప కల్చరల్ : కడప నగరం మోచంపేటలోని అహోబిల మఠంలోగల శ్రీ లక్ష్మి నరసింహస్వామి సన్నిధిలో ఈనెల 17 నుంచి జనవరి 14వ తేదీ వరకు ధనుర్మాస పూజలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ప్రతిరోజు ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. 23న వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని వైకుంఠ ద్వార దర్శనం ఏర్పాటు చేయనున్నారు. జనవరి 1న నూతన సంవత్సర సందర్భంగా విశేష పుష్పాలంకార సేవ, 12న గుడారైవెళ్లి విశేష ఆరాధన, 14న భోగి పండుగ నాడు ఉదయం 10 గంటల నుంచి శ్రీ గోదాదేవి కల్యాణం నిర్వహిస్తారు.

■ జయనగర్ కాలనీలోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో కూడా 17 నుంచి ధనుర్మాస పూజలు నిర్వహించనున్నారు.

■ గడ్డిబజారులోని శ్రీ లక్ష్మి సత్యనారాయణస్వామి ఆలయంలో 23న వైకుంఠ ఏకాదశి సందర్భంగా శ్రీ లక్ష్మీనారాయణ, సుదర్శన హోమాలు, 10 గంటలకు గ్రామోత్సవం నిర్వహిస్తారు. 26న ఉదయం 7.30 గంటలకు సత్యనారాయణస్వామి వ్రతం, జనవరి 12న గోదాదేవి ఉత్సవం, 13న కల్యాణం, 16న గ్రామోత్సవం నిర్వహిస్తారు.

జాతీయస్థాయి పోటీలకు గంగనపల్లె విద్యార్థులు



ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన క్రీడాకారులు

కడప స్పోర్ట్స్ : పెండ్లిమర్రి మండలం గంగనపల్లె జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఏపీ ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో సత్తాచాటారు. ఈ నెల 12 నుంచి 14వ తేదీ వరకు గుంటూరు జిల్లా నరసరావుపేటలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాఠశాలకు చెందిన 7వ తరగతి విద్యార్థిని ఎస్. ఫౌజియా అండర్-14 పోల్‌వాల్ట్ బాలికల విభాగంలో 2.10 మీటర్ల ఎత్తు దూకి ప్రథమస్థానంలో నిలిచి గోల్డ్‌మెడల్ సాధించింది. అదే విధంగా వి. మోనిస్ 1.70 మీటర్ల ఎత్తు దూకి రెండోస్థానంలో నిలిచి రజత పతకం కైవసం చేసుకుంది. దీంతో పాటు జాతీయస్థాయి ఎస్‌జీఎఫ్ అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొనే ఏపీ జట్టుకు వీరు ఎంపికైనట్లు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ బి. శివశంకర్‌రెడ్డి తెలిపారు.

ఆటో కార్మికుల నిరసన

కడప వైఎస్ఆర్ సర్కిల్ : నగరంలోని ఆటో కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డి పేర్కొన్నారు. బుధవారం నగరంలోని పాత రిమ్స్ వద్ద నున్న ఆటో స్టాండ్ వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మద్దిలేటి, నాయకులు మల్లిఖార్జున, ఆవుల నారాయణ, పుల్లయ్య, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : అంగన్వాడీల న్యాయమైన సమస్యల పరిష్కారంతోపాటు ఆమోదయోగ్యమైన డిమాండ్ల సాధనకు తగిన చర్య లు చేపట్టాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఏపీ అంగన్వాడీ కార్యకర్తల సమస్యల పరిష్కారానికి సీఐటీయూ, ఏఐటీయూసీ ఆధ్వ ర్యంలో ఐసీడీఎస్ అర్బన్ కార్యాలయం ఎదుట చేపట్టిన సమ్మె బుధవారానికి రెండవరోజుకు చేరుకుంది. ఈ కార్యక్రమంలో సీఐటీయూ, అంగన్వాడీ వర్కర్ల యూనియన్ నాయకురాళ్లు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎర్రబ్యాడ్జీలతో నిరసన

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీ పీటీడీ ఎన్ఎంయూఏ రాష్ట్ర నాయకుల పిలుపు మేరకు రెండవరోజు బుధవారం ఎర్రబ్యాడ్జీలతో నిరసన తెలిపి అనంతరం గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు పీవీ శివారెడ్డి, రీజినల్ ప్రెసిడెంట్ నాగముని, రీజినల్ నాయకులు నారాయణ మాట్లాడుతూ ఆర్టీసీలో పెండింగ్ సమస్యలన్నీ పరిష్కరించాలని కోరారు. ఆర్టీసీ సిబ్బందికి పనిభారం పెరిగినందున అదనంగా మానిటరింగ్ డ్యూటీల నుంచి మినహాయింపు ఇవ్వాలన్నారు. ఉద్యోగులకు అవసరమైన మేరకు వేతనంతో కూడిన సెలవులు మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు దాస్, సగినాల శ్రీనివాసులు, మల్లేష్, లక్ష్మయ్య, సుబ్బారావు, సురేష్‌బాబు, వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైవీయూలో ముందస్తు క్రిస్మస్ వేడుకలు



వేడుకల్లో పాల్గొన్న విద్యార్థినీ విద్యార్థులు



కేక్ కట్ చేస్తున్న వైవీయూ వీసీ ఆచార్య చింతా సుధాకర్

వైవీయూ : యోగి వేమన విశ్వవిద్యాలయంలో బుధవారం రాత్రి ముందస్తు క్రిస్మస్ వేడుకలు విద్యార్థుల ఆధ్వర్యంలో నిర్వహించారు. వేడుకలకు ముఖ్యఅతిథిగా విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య చింతా సుధాకర్, దైవ సందేశకులు బీఎం జోసెఫ్ కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఉపకులపతి మాట్లాడుతూ క్రీస్తు జీవన విధానం అనుసరణీయమని, క్రిస్మస్ అందరి పండుగ అని సందేశం ఇచ్చారు. జోసెఫ్ మాట్లాడుతూ ఏసు క్రీస్తు లోక రక్షకుడని, మానవుల పాపాలను పోగొట్టేందుకు ఈ లోకానికి వచ్చాడన్నారు. కార్యక్రమంలో ఆచార్య గంగయ్య, ఆచార్య జయరాజు, డాక్టర్ మెర్సీ విజేత, డాక్టర్ సుమిత్ర, డాక్టర్ సతీష్ బాబు, డాక్టర్ లక్ష్మీప్రసాద్, హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నరేష్, విశ్వవిద్యాలయ విద్యార్థులు పాల్గొన్నారు.

అన్ని విభాగాలు సమర్థవంతంగా పనిచేయాలి

విశ్వవిద్యాలయ అనుబంధ విభాగాలు సమర్థవంతంగా పనిచేసినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని యోగి వేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య చింతా సుధాకర్ అన్నారు. ఐక్యూఏసీ, ప్లేస్మెంట్ సెల్, కాంపిటీటివ్ సెల్, ఉమెన్ సెల్ తదితర 26 విభాగాలకు చెందిన కో ఆర్డినేటర్లతో వీసీ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఏడాది కాలంలో ఆయా విభాగాలు సాధించిన ప్రగతి, వారి ముందున్న లక్ష్యాల గురించి చర్చించారు. విద్యాలయ నాణ్యత ప్రమాణాలు, గ్రేడులలో, ర్యాంకులలో ముందు ఉండాలంటే అనుబంధ విభాగాలు సమర్థవంతంగా పనిచేయాలని ఉద్బోధించారు. సమావేశంలో ఆయా విభాగాల సంచాలకులు, సమన్వయకర్తలు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులను రెగ్యులర్ చేయాలి



మాట్లాడుతున్న మున్సిపల్ కార్మిక సంఘాల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ సుబ్బరాయుడు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మున్సిపల్ కార్మికులను రెగ్యులర్ చేయాలని మున్సిపల్ కార్మిక సంఘాల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ సుబ్బరాయుడు పేర్కొన్నారు. బుధవారం నగరంలోని హోచిమన్ భవన్‌లో రాయలసీమ జిల్లాల మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలన్నారు. కరోనా విపత్తులో ప్రాణాలకు తెగించి పని చేసి మరణించిన కార్మికుల కుటుంబాలకు రూ.50 లక్షల ఎక్స్ గ్రేషియా విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, రాయలసీమ జిల్లాల ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజేష్ గౌడ్, నాయకులు మద్దిలేటి, శ్రీనివాసులు, సురేష్‌కుమార్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

డీసీసీ బ్యాంకు సేవలను వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న డీసీసీ బ్యాంకు మేనేజర్ ఆంజనేయులురెడ్డి

వల్లూరు : రైతులు, మహిళలు, గ్రామీణ అభివృద్ధే ప్రధాన ధ్యేయంగా ఏర్పాటు చేసిన డీసీసీ బ్యాంకు సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కడప జీఆర్ఆర్ స్ట్రీట్ బ్రాంచ్ మేనేజర్ పీ ఆంజనేయులురెడ్డి తెలిపారు. మండల పరిధిలోని పెద్దపుత్త గంగమ్మ ఆలయ ప్రాంగణంలో వల్లూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన ఆర్థిక అక్షరాస్యత, సాంకేతికతపై అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తమ బ్యాంకులో 15 సంవత్సరాల పిల్లలకు కిడ్స్ పొదుపు ఖాతాలు, కిడ్స్ రికరింగ్ డిపాజిట్ ఖాతాలు, కిడ్స్ డిపాటిజిట్ ఖాతాలను తెరవడం జరుగుతుందని తెలిపారు. వీటి వలన పిల్లల్లో చిన్న వయసు నుండే పొదుపుతో పాటు బ్యాంకింగ్ గురించి అవగాహన పెంపొందుతుందన్నారు. పిల్లల పొదుపు ఖాతాలోని సొమ్ముపై 7 శాతం వడ్డీ ఇస్తారన్నారు. ఈ బ్యాంక్‌లో బీమా సౌకర్యం, ఏటీఎం సౌకర్యం అందుబాటులో వుందన్నారు. రైతులు, మహిళా సంఘాలకు, చిరు వ్యాపారులకు, పశు పోషకులకు, గ్రామీణ, పట్టణ గృహ నిర్మాణాలకు రుణాలు ఇస్తారన్నారు. వల్లూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో జనవరి మాసం నుంచి గోల్డ్ లోన్ సౌకర్యం అందుబాటులోకి రానుందని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ సీఈవో రామచంద్రయ్య తెలిపారు. కార్యక్రమంలో సీవో సుబ్బారెడ్డి, ఫీల్డ్ ఆఫీసర్ ఎస్.శ్రీనివాసులురెడ్డి, పీఏసీఎస్ సిబ్బంది సుధాకర్, రైతులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులుగా గుర్తించాలి

కడప కార్పొరేషన్ : ఎనర్జీ అసిస్టెంట్లను సచివాలయ ఉద్యోగులుగా గుర్తించాలని గ్రామ, వార్డు సచివాలయం ఎనర్జీ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు కోరారు. బుధవారం ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషాకు వారు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కె. మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ సచివాలయ ఉన్నతాధికారులు 18 శాఖల ఉద్యోగుల పనితీరును పర్యవేక్షిస్తూ వారి సమస్యలు తెలుసుకుంటూ పరిష్కరిస్తున్నారన్నారు. కాగా ఒక్క ఎనర్జీ సెక్రటరీలను మాత్రం విస్మరించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు సత్తార్, నారాయణరెడ్డి, మల్లికార్జున, శ్రీనివాసులరెడ్డి, నాగేంద్ర, శివ, ప్రకాష్‌రావు, హాజీ బాషా, సుందర్‌నాయక్ పాల్గొన్నారు.

ప్రభుత్వం చేస్తున్న మేలును తెలియజేయాలి

ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి



దళిత నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డి

కడప కార్పొరేషన్ : దళిత వర్గాలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేస్తున్న మేలును తెలియజేయాలని కమలాపురం శాసన సభ్యులు పి. రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో కమలాపురం నియోజకవర్గంలోని దళిత నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో దళితులకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని, ఆయా వర్గాలకు ఇచ్చిన పదవులే ఇందుకు నిదర్శనమన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల దళితులకు ఎక్కువ మేలు జరిగిందన్నారు. ఈ విషయాలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత పార్టీలో ఉన్న దళిత నాయకులపై ఉందన్నారు. నియోజకవర్గంలో దళితులు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో పర్యటించి ఈ మేరకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బి. కిషోర్ కుమార్, ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పులి సునీల్ కుమార్, వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండో పోటీల్లో కడప విద్యార్థి సత్తా



మహమ్మద్ బాషా

కడప స్పోర్ట్స్ : ఈనెల 9, 10 తేదీల్లో బెంగుళూరులో నిర్వహించిన జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో కడప నగరం మృత్యుంజయకుంటకు చెందిన సయ్యద్ మహమ్మద్‌బాషా రెండు పతకాలు సాధించాడు. కడప నగరంలో మార్షల్‌ఆర్ట్స్ శిక్షకురాలు విజయలక్ష్మి వద్ద శిక్షణ పొందుతున్న ఈయన పూమ్‌సేయ్, క్యోరుగి విభాగాల్లో రెండు గోల్డ్‌మెడల్ సాధించాడు. ఈయన ప్రతిభ పట్ల తండ్రి ఎస్. ఇంతియాజ్ అహ్మద్ సంతోషం వ్యక్తం చేశాడు.

రక్తదాన శిబిరం

చింతకొమ్మదిన్నె : నగర శివార్లలోని అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ. సుధాకర్‌రెడ్డి తెలిపారు. రక్తదానం ఇచ్చిన దాత శరీరంలో కొలెస్ట్రాల్ తగ్గి రక్తపోటు నియంత్రణలో ఉంటుందన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ స్పెషల్ ఆఫీసర్ శివశంకర్‌రెడ్డి, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మేనేజర్ రమేష్, కళాశాల ఎన్ఎస్ఎస్ సమన్వయ కర్తలు పాల్గొన్నారు.

అర్జీదారుల సమస్యలను పరిష్కరించాలి

జాయింట్ కలెక్టర్ జి.గణేష్ కుమార్



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్

పెండ్లిమర్రి : మండల స్థాయిలో జరిగే జగనన్నకు చెబుదాం, స్పందన కార్యక్రమాల్లో అర్జీదారులకు సంతృప్తి స్థాయిలో నాణ్యమైన పరిష్కారం అందించాలని జాయింట్ కలెక్టర్ జి.గణేష్‌కుమార్ అధికారులకు సూచించారు. బుధవారం పెండ్లిమర్రి మండల పరిషత్ సభాభవనంలో మండలస్థాయి జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రానికి రాలేని వారి సమస్యలు మండల స్థాయిలో స్థానికంగా పరిష్కారం కావాలని ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారన్నారు. దీనిని ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతో అమలు చేస్తున్నదన్నారు. ప్రజల నుంచి వినతులు మండలస్థాయిలోనే త్వరగా పరిష్కారం అయ్యేలా అధికారులు దృష్టి సారించాలన్నారు. ప్రజల నుంచి వచ్చిన వినతులపై నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని సిబ్బందిని ఆయన హెచ్చరించారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ ప్రత్యూష, ఆర్డీవో మధుసూదన్, తహసీల్దార్ ఉదయభాస్కర్ రాజు, వివిధశాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

డ్వాక్రా సంఘాలను బలోపేతం చేయాలి



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ ఆనంద్ నాయక్

పెండ్లిమర్రి : గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న డ్వాక్రా సంఘాలను బలోపేతం చేయడానికి యానిమేటర్లు కృషి చేయాలని డీఆర్‌డీఏ పీడీ ఆనంద్ నాయక్ తెలిపారు. పెండ్లిమర్రి మండల సమాఖ్య కార్యాలయంలో బుధవారం వీఓఏలకు నిర్వహించిన రివ్యూ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సంఘాలు బలోపేతం అయితే సభ్యులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారన్నారు. బ్యాంకుల్లో రుణాలు పొందిన సభ్యులు సకాలంలో రుణాలు చెల్లించి ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలు పొందాలన్నారు. అనంతరం జగనన్న పాల వెల్లువ, ఏపీసీఎన్ఎఫ్, ఇంటర్నల్ లెండింగ్ వంటి ప్రాజెక్టులపై రివ్యూ నిర్వహించి వాటిలో పురోగతి పెంచాలన్నారు. కార్యక్రమంలో ఏరియా కోఆర్డినేటర్ రఘునాథ్‌రెడ్డి, ఏపీఎం వెంకటేశ్వరరావు, సీసీలు పాల్గొన్నారు.

రోడ్డు పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే

చింతకొమ్మదిన్నె : మండలంలోని రసూల్‌పల్లె నుంచి గంగన్నపల్లెకు వెళ్లే రోడ్డు పనులను బుధవారం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి ప్రారంభించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో రసూల్‌పల్లె నుంచి గంగన్నపల్లెకు రోడ్డు కావాలని ప్రజలు కోరారు. ఈ మేరకు స్పందించిన ఎమ్మెల్యే తన సొంత నిధులతో పనులను ప్రారంభించారు. దీంతో గ్రామంలోని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గూడ ప్రభాకర్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

శనగ పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

వీరపునాయునిపల్లె : ప్రస్తుతం సాగులో ఉన్న బుడ్డ శనగ పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని కమలాపురం వ్యవసాయ సహాయ సంచాలకులు నరసింహారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మండలంలోని ఇందుకూరు రైతు భరోసా కేంద్ర పరిధిలో సాగు చేసిన బుడ్డ శనగ పంటను పరిశీలించి మాట్లాడారు. శనగ పంటలో పొగాకు లద్దె పురుగు మరియు రబ్బరు పురుగుల ఉధృతి ఎక్కువగా ఉన్నట్లు గుర్తించామన్నారు. ఈ పురుగు కాండంను తుంచి నష్టం కలిగిస్తుందని దీని నివారణకు నోవాల్యురాన్ మరియు ఇండాక్సా కార్బన్‌ను లీటరు నీటికి 1.5 ఎంఎల్, లేదా టెట్రనిలిపోల్ 0.5 ఎంఎల్ లేదా క్లోరంట్రనిలిప్రోల్ 0.3 ఎంఎల్ లీటరు నీటికి కలిపి పంటపై పిచికారి చేయాలన్నారు. ప్రస్తుతం వాతావరణానికి మినుము, పెసర, నువ్వుల పంటలో బూడిద తెగులు సోకే అవకాశం ఉన్నందున నివారణకు మైక్లోబూటానిల్ లీటరు నీటికి 1మిల్లీ లీటరు కలిపి పిచికారి చేయాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శ్యామ్‌బాబు, వ్యవసాయ సహాయకులు వాణి, రైతులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రికి రుణపడి ఉన్నాం

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి సమస్యలన్నింటినీ పరిష్కరిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉన్నామని వైఎస్సార్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బాబా ఫకృద్దీన్ తెలిపారు. బుధవారం ఆయన స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. తమ అసోసియేషన్‌కు గుర్తింపు కల్పించినందుకు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. ఆర్టీసీ ఎండీని మంగళవారం విజయవాడలో కలిసిన సందర్భంగా ఉద్యోగుల సమస్యలన్నీ పరిష్కరించేందుకు జీఓలు విడుదల చేస్తున్నామని ఆయన తెలియజేశారన్నారు. ప్రతి ఉద్యోగి సంస్థ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని సూచించారన్నారు.